క్లుప్తంగా

13న తలనీలాల వేలం పాటలు

బేతంచెర్ల: ప్రసిద్ధి చెందిన వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహా స్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే తలనీలాల వేలం పాటలు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు తెలిపారు. 09-09-2023 నుంచి 08-09-2024 వరకు ఏడాదికి నిర్వహించే ఈ వేలం పాటలో దేవాదాయ శాఖ నిబంధనల మేరకు ధరవాత్తు చెల్లించి పాటలో పాల్గొన్నాలన్నారు. 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఆలయ ఆవరణంలో ధర్మకర్తల మండలి సభ్యుల సమక్షంలో టెండర్, షీల్డు టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

శ్రీ కృష్ణుడు జగద్గురువు



శంకలాపురంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: భగవద్గీతను బోధించిన శ్రీ కృష్ణుడు జగద్గురువు అని ధర్మవరం కమిటీ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని శంకలాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత, ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆషాఢమాస గురు పౌర్ణమి ప్రత్యేకతపై ప్రచారం చేశారు. ప్రతి ఒక్కరూ త్రైత సిద్ధాంత భగవద్గీతను చదివి జ్ఞానం పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సభ్యులు మద్దిలేటి, వెంకటేష్, పరశురాముడు, శ్రీనివాసులు, అనిల్, జయేశ్వరి, మద్దమ్మ, శివలక్ష్మి పాల్గొన్నారు.

సంత వెలవెల!



ప్రజలు లేక బోసిబోయిన మార్కెట్

బేతంచెర్ల: కూరగాయాల ధరలు మండుతున్నాయి. పారిశ్రామిక కేంద్రం బేతంచెర్ల పట్టణంలో ప్రతి ఆదివారం జరిగే సంత జనంతో కళకళలాడేది. అయితే నేడ సంతమార్కెట్ వెలవెలబోయింది. టమోట, పచ్చిమిరప కేజీ రూ. 120 పైన ధర పలుకుతుండగా కొనలేని పరిస్థితి. ఏ కూరగాయను పలుకరించిన కేజీ రూ. 50పైమాటే అంటున్నాయి. దీంతో అయోమయానికి గురువుతున్నారు పేద, మధ్య తరగతి ప్రజలు.

పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

డోన్ టౌన్ : ప్రభుత్వ పెన్షనర్లు తప్పనిసరిగా ఈ నెల 18వ తేదీలోపు కేవైసీ చేయించుకోవాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు భానుసింగ్, గాలయ్య తెలిపారు. స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈకేవైసీ కోసం ఆధార్‌కార్డు, సెల్ నంబరుతో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు మౌలాలీ, గోపాల్, లోక్‌నాథ్ రెడ్డి, దాసప్ప, రామదాసురెడ్డి, పురుషోత్తం, సుబ్రహ్మణ్యం, జయరాముడు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బందార్లపల్లె సమీపాన ఉన్న నేల బెలుం వద్ద ఆదివారం పేకాట స్థావరంపై సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి చెప్పారు. పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఐదు మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని రూ.20,140 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బేతంచెర్ల: పట్టణానికి సమీపాన కర్నూలు రహదారిలోని అయ్యల చెర్వులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సీతారామాపురం గ్రామానికి చెందిన రామలింగడు కుమారుడు సూరికి తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్రవాహనంపై బేతంచెర్లకు వచ్చి పనులు ముగించుకుని వెళ్లుండగా అయ్యల చెర్వులో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. సూరిని 108 సిబ్బంది శేషారెడ్డి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు.

ప్రారంభమైన ఆలయ నిర్మాణ పనులు



పునాదులు తీసిన దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని గౌరిపేట ఆంజనేయ, చెన్న కేశవ స్వామి ఆలయ ఆవరణలో వినాయక, వేణుగోపాల, మాధవ స్వామి ఆలయాలతోపాటు ఉత్తర ద్వారం, కాలక్షేప మండప నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో 1.50 కోట్లు మంజూరయ్యాయి. పూరాతన ఆంజనేయ, చెన్నకేశవ స్వామి ఆలయానికి మహర్దశ రానుంది.

పేదల ఇంట ఉచిత వెలుగులు

- ఎస్సీ,ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- బనగానపల్లె నియోజకవర్గంలో 16,998 గృహాలకు సరఫరా
- సంతోషం వ్యక్తం చేస్తున్న దళితులు, గిరిజనులు



పెట్నికోటలోని ఎస్సీ కాలనీ

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని సామాజిక వర్గాలకు మేలు చేకూర్చుతుంది. రైతులతోపాటు కుల, చేతివృత్తులు, చిన్న వ్యాపారులకు అనుగుణంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తుంది ప్రభుత్వం. ఎన్నికల ముందు ఆయా సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన ఉచిత విద్యుత్‌హామీ నెరవేర్చడంతో వారి ఇళ్లలో వెలుగులు మెరుస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీల కుటుంబాలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్‌ను అందించి మాట నిలుపుకున్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువ భాగం నిరుపేదలు ఉంటారు. నెలవారీ విద్యుత్ బిల్లులు చెల్లించే సమయంలో కాయ కష్టం చేసుకునే సొమ్ము విద్యుత్‌బిల్లులకు చెల్లించాల్సి వస్తుండేది. ఈకష్టాలకు చెక్ పెట్టేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2019 జూలైలో జీఓ నెంబర్ 91 జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, తండాల్లో నివసించే వారికి ఉచిత విద్యుత్ ఇస్తామని జీఓలో స్పష్టంగా పేర్కొంది. వాటికి అనుగుణంగానే విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కం) ఉచిత విద్యుత్ అందిస్తున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 21వేలకు మందికి పైగానే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు ఉండగా 16,998 గృహాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో ఆయా సామాజిక వర్గాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీలను మభ్యపెట్టిన గత టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అంటూ మభ్యపెట్టింది. నామమాత్రంగా 50 యూనిట్లకు పరిమితం చేసి పేదలను ఇబ్బంది పెట్టింది. పేరుకేమో ఉచితం అంటూనే బిల్లులు వేసి చెల్లించాలంటూ ఆ శాఖ సిబ్బంది వత్తిడికి పాల్పడ్డారు. కొందరు అధికారులు సైతం కాలనీల్లో పర్యటించి బిల్లులు చెల్లించాలని హుకుం జారీ చేసిన సంఘటనలు ఉన్నాయి. బిల్లు కట్టకపోతే కనెక్షన్ కట్ చేయడం లేక విద్యుత్ తీగను తీసుకుపోయేవాళ్లు. ఏమాత్రం గడువు లేకుండానే కనెక్షన్‌లు తొలగించేవారు. దీంతో బిల్లులు చెల్లించినా కుటుంబాలు సైతం విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. అయితే 2019 సాధారణ ఎన్నికలకు ముందు 50 యూనిట్ల నుంచి ఉచిత విద్యుత్‌ను 100 యూనిట్లకు పెంచి మరోమారు మభ్యపెట్టేందుకు ప్రయత్నించింది అప్పటి టీడీపీ ప్రభుత్వం. అయితే ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల ప్రజలు ఎన్నికల్లో గట్టిగానే దిబ్బ తీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణంగా మద్దతు పలుకడంతో తిరుగులేని మెజార్టీ సాధించారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీ మేరకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా అందజేసి వారి ఇళ్ల ఉచిత వెలుగులు నింపారు.

పైసా బిల్లు కట్టడం లేదు



ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతుంది. ఇంత వరకు పైసా కరెంట్ బిల్లు కట్టలేదు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఆపై దాటితే చెల్లించాల్సి వస్తుంది. ప్రభుత్వం ఇస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 200 యూనిట్లు దాటకుండా పొదుపుగా విద్యుత్ వాడుకుంటున్నాం. ఈ పథకం బాగా ఉపయోగపడుతుంది. – ధనలక్ష్మి, అంకిరెడ్డిపల్లె

కరెంట్ బిల్లు భారం తగ్గింది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీలకు కరెంటు బిల్లుల భారం తగ్గింది. టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ బిల్లు చెల్లించకుంటే తీగెలు కట్ చేసి తీసుకెళ్లేవారు. పేదలు చాలా ఇబ్బందులు పడ్డారు. ఏదోరూపాన బిల్లు చూపించి వసూళ్లు చేశారు. జగనన్న సీఎం అయ్యాక 200 యూనిట్ల కరెంట్ ఇచ్చి ఆదుకుంటున్నారు. ఇప్పుడు కరెంట్ బిల్లు కట్టాలనే భయం లేదు. భారం పూర్తిగా తగ్గింది. – ప్రభాకర్, కల్వటాల

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అముదాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

11న ‘జగనన్న సురక్ష’

బనగానపల్లెరూరల్: పట్టణంలోని గ్రామ సచివాలయం-1, 5 పరిధిలో 11వ తేదీన జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ శివరామయ్య ఆదివారం తెలిపారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించడంతోపాటు రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు, ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్, ఫ్యామిలి సర్టిఫికెట్, ఆదాయ కులధ్రువీకరణ పత్రాలు, కౌలు రైతుల గుర్తింపు కార్డులు, పొజిషన్ సర్టిఫికెట్ తదితర 11 రకాల ప్రభుత్వ సేవలు అందజేస్తామన్నారు. ఈ నెల చివరి వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

దళితులపై దాడి చేసిన వారిని శిక్షించాలి



డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలోని చిగురమానుపేటకు చెందిన దళితుడు బాల చిరంజీవిపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరతూ ఆదివారం మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ మాదిగ ఆధ్వర్యంలో డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేశారు. అనంతరం రమేష్ మాదిగ మాట్లాడుతూ బాల చిరంజీవి జూన్ 23న తన షాపు వద్ద ఉండగా కొమటి ప్రసాద్ అనే అనాథను అక్బర్ అనే వ్యక్తి బైకుతో ఢీకొట్టి వెళ్లగా గమనించి సంఘటనను మెకానిక్ యూనియన్ లీడరు హుస్సేన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఇద్దరి మధ్య మాట మాట పెరిగి మరుసటి రోజు ఇంటి బయట మంచంపై నిద్రిస్తున్న బాల చిరంజీవిపై హుస్సేన్, పూల షేక్షా, అల్లా బకాష్, సోహెల్ అనే వ్యక్తులతో కలిసి దాడి చేసి గాయ పరిచాడన్నారు. వినతి పత్రం అందించిన వారిలో బాధితుడుతో పాటు రవి, రాధమ్మ, రమాదేవి, ఓబులమ్మ, నాగరాజు, ప్రశాంత్, సంజీవ్, పాల్ తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



జేసీబీతో పూడిక తీస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో ప్రధాన రహదారి పక్కలోని ప్రధాన మురిగు నీటి కాల్వలో ఆదివారం ముమ్మరంగా సాగాయి. సర్పంచ్ నాగన్న, మండల ఉపాధ్యక్షుడు దస్తగిరి ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపట్టారు. కాల్వ చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు ప్రధాన రహదారిపై పారుతుండడడంతో రాకపోకలకు ఇబ్బంగా మారింది. స్పందిచిన వారు చింత చెట్ల వరకు జేసీబీ సాయంతో పూడికతీయించి శుభ్రం చేయించారు. ఒకటి రెండు చోట్ల సిమెంట్ పైపుల్లో ఉన్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించే పనులు చేపడుతామని సర్పంచ్ తెలిపారు. కాల్వల్లో చెత్త చెదారం వేయకుండా గ్రామస్తులు సహకరించాలని కోరారు.

వరి సాగుకే మొగ్గు!

- విస్తారంగా నారుమళ్లు
- రబీ కంటే రెట్టింపు సాగు అవుతుందని అంచనా
- గిట్టుబాటు ధర ఉండడంతో ఆసక్తి చూపుతున్న రైతులు



వరి నారుమళ్లు వేసిన దృశ్యం

బనగానపల్లె: ప్రధాన పంట వరి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. గతేడాది మంచి దిగుబడితోపాటు గిట్టుబాటు ధర లభించడంతో ప్రస్తుత ఖరీఫ్‌లో వరి సాగు చేసేందుకే రైతులు మొగ్గు చూపుతున్నారు. గత పదిహేను రోజులుగా వరినారుమళ్లను తయారు చేస్తున్నారు. గతేడాడి ఖరీఫ్‌లో సాగు చేసిన బీపీటీ 5,204, నంద్యాల సోనా మంచి దిగుబడి లభించింది. అదేవిధంగా గిట్టుబాటు ధర లభించింది. ప్రస్తుతం నంద్యాల సోనా గిట్టుబాటు ధర 75 కిలోలు రూ.2,800, బీపీటీ 5204 రూ.2,400 చొప్పున ఉంది. రబీలో పండించిన షుగర్‌లెస్ వరికి గిట్టుబాటు ధర కూడ రూ.2200 వరకు ఉండడంతో నిల్వ ఉంచుకున్న రైతులకు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో బనగానపల్లె నియోజకవర్గంలో సుమారు 18వేల హెక్టార్లలో రైతులు ఎస్సార్బీసీ, వ్యవసాయ బోర్లు, చెరువుల కింద వరి సాగు చేశారు. రబీలోనూ 11వేల హెక్టార్లలో వరి పంటను సాగు అయ్యింది. ప్రస్తుతం ఖరీఫ్‌లో దాదాపు 25వేల హెక్టార్ల వరకు వరి సాగు ఉంటుందని వ్యసాయాధికారుల అంచనా. మరో రెండువారాల్లో వరినాట్లు వేసేందుకు రైతన్న సిర్వం సిద్ధం చేసుకుంటున్నాడు. ఆర్‌బీకేల్లో ఎరువులను రైతులకు అందుబాటులో ఉండడంతో రైతన్న ధైర్యంగా ఉన్నాడు. ప్రభుత్వం ఇటీవలే పెట్టుబడి సాయం మొదటి విడతగా రూ.5500 రైతుల ఖాతాల్లో జమ చేయడంతో ఖర్చుల గురించి ఏ మాత్రం ఆలోచించకుండా వరి సాగుకు సిద్ధం అవుతున్నారు రైతులు.

గిట్టుబాటుగా ఉంది



ఖరీఫ్‌లో వరి సాగువిస్తీర్ణం గణనీయంగా పెరగనుంది. ప్రస్తుతం నంద్యాల సోనా, బీపీటీ రూ 5,204 గిట్టుబాటు ధర ఊహించని విధంగా ఉన్నందున ఈ పంటసాగుకే రైతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. పంట మార్పిడి చేస్తేనే అన్నివిధాలుగా బాగుంటుంది. గతేడాది ఈ పంటను చీడపీడలు తక్కువగా ఆశించడంతో రైతుకు ఖర్చులు తగ్గాయి. – సుబ్బారెడ్డి, ఏఓ బనగానపల్లె మండలం

చురుగ్గా సాగుతున్న సీసీ రోడ్ల పనులు



రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్న దృశ్యం

డోన్ టౌన్ : మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సీసీ రోడ్ల పనులు చురుగ్గా సాగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వెంకటాపురం పర్యటించిన ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మండల స్థాయి అధికారులను సీసీ రోడ్లు మంజూరు చేయాలని గ్రాస్తులు కోరారు. స్పందించిన ఎంపీపీ రూ.10లక్షలు కేటాయించారు. ఈ మేరకు సర్పంచ్ రాణి ఆధ్వర్యంలో రెండు ప్రాంతాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారు. మంచినీటి ట్యాంక్ నుంచి బోయ చిన్నమద్దిలేటి ఇంటి వరకు, గుమ్మకొండ ప్రధాన రహదారి నుంచి జగదుర్తి గ్రామానికి వెళ్లే దారిలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం పనులను వేగంగా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విన్నవించిన సమస్య పరిష్కారం కానుండడంతో గ్రామ ప్రజలు వైఎస్సార్ సీసీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నేడు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం

బేతంచెర్ల: పట్టణంలోని నాల్గవ సచివాలయం పరిధిలోని దుర్గాపేట, బేగరిపేట, సంజీవనగర్ కాలనీల్లో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. ఆయా కాలనీల్లో ప్రజలు తమ సమస్యలను అధికారులు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిస్తామని, ప్రజలతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పైతాన్ కోర్సులో ఉచిత శిక్షణ

డోన్ టౌన్ : పట్టణంలోని బీపీ శేషారెడ్డి నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో(జాడీల ఫ్యాక్టరీ)ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్పర్ (పైతాన్)కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ బీ ఎస్సీ కంప్యూటర్స్, బీ టెక్ కంప్యూటర్స్ విద్యార్థులు అర్హులన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికెట్‌ను అందజేస్తామన్నారు. ఆసక్తి అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

13 నుంచి కొలిమిగుండ్లలో...


కొలిమిగుండ్ల: మండల పరిధిలోని యర్రగుడి, హనుమంతుగుండం గ్రామాల్లో 13నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. 13న మధ్యాహ్నం యర్రగుడి, హనుమంతు గుండం, 14న ఉదయం 8గంటల నుంచి నాగిశెట్టిపల్లె, బిఉప్పలూరు, బి తాడిపత్రి గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమాలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని, గడప గడపకు వెళ్లి ప్రజకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. అదేవిధంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు తీసుకుంటారని తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆలయ బావిలో పూడికతీత



బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లెలో వెలసిన బ్రహ్మ సహిత నాగలింగేశ్వర స్వామి ఆల య బావి పూడికతీత పనులను గ్రామస్తులు ఆదివారం చేపట్టారు. దాదాపు 40 సంవత్సరాల క్రితం పూడిక తీశామని ఆలయ చైర్మన్ చిన్ని శేషఫణి తెలిపారు. పూడికతీత పనులను నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పర్యవేక్షించారు. గ్రామస్తులు స్వచ్ఛందంగా పూడికతీత పనుల్లో పాల్గొనడం అభినందనీయమని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు.

జగనన్న కాలనీలు... చూడచక్కని ఇళ్లు!



పారంభానికి ముస్తాబైన ఇళ్లు

- సుందరంగా నిర్మించుకుంటున్న లబ్ధిదారులు
- కళకళలాడుతున్న గృహాలు
- ఇప్పటికే కొందరు గృహప్రవేశం



తుమ్మలపెంట కాలనీలో గృహ ప్రవేశం చేసిన ఇళ్లు

కొలిమిగుండ్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా పేదల సొంతింటి కల సాకారమవుతుంది. ఇళ్లు కాదు ఏకంగా ఊర్లే వెలుస్తున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో లబ్ధిదారులు చూడచక్కనైన ఇళ్లు నిర్మించుకుంటున్నారు. హాల్, బెడ్ రూం, కిచెన్, టాయ్‌లెట్లు ఇలా అన్నీ రకాల వసతులతో సౌకర్యంగా ఉండేలా నిర్మించుకుంటున్నారు. కొంత మంది లబ్ధిదారులు ఇళ్లు ఆకర్షణీయంగా ఉండేలా ఎలివేషన్ చేయించుకుంటున్నారు. ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో అవస్థలు పడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాలు చేపట్టి రూ.లక్షలు విలువ చేసే స్థిరాస్తి పేదలకు సొంతమయ్యేలా చేస్తుంది. కొలిమిగుండ్ల మండలానికి 2210 ఇళ్లు మంజూరు కాగా 1620కి పైగానే వివిధ దశల్లో ఉన్నాయి. 296 గృహాలు పూర్తయ్యాయి. కొలిమిగుండ్లలో కస్తూర్బా పాఠశాల సమీపంలోని 544–డీ జాతీయ రహదారి చెంతనే ఏర్పాటు చేసిన కాలనీతో పాటు తుమ్మలపెంట కాలనీలు ఇళ్ల నిర్మాణాలతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. రెండు కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడంతో లబ్ధిదారులు గృహప్రవేశాలు చేస్తున్నారు. ప్రభుత్వం లబ్ధిదారులకు కాలనీల్లో రోడ్లు, విద్యుత్,తాగునీటి సౌకర్యాలు కల్పించింది. దీంతో వేగంగా ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటున్నారు. కొలిమిగుండ్ల,తుమ్మలపెంట కాలనీలు ఊర్లుగా మారబోతున్నాయి.



జాతీయ రహదారి పక్కన జగనన్న కాలనీలో చురుగ్గా సాగుతున్న గృహ నిర్మాణాలు



బస్టాండ్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మలుపు



తేరు వద్ద కూడలిలో స్పీడ్ బ్రేకులు లేని దృశ్యం

మలుపులకు..స్పీడ్ బ్రేకులు పడేనా!

అవుకు: మండల కేంద్రం అవుకు బస్టాండ్ సమీపాన రోడ్డు మలుపు ప్రమాదాలకు కేంద్రంగా మారింది. కనీసం స్పీడ్ బ్రేకులు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అనంతరంపురం జిల్లా తాడిపత్రి నుంచి కొలమిగుండ్ల, అవుకు, బనగానపల్లె మీదుగా కర్నూలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అదేవిధంగా ఓ వైపు బనగానపల్లెలో మహాసిమెంట్ ఫ్యాక్టరీ, మరోవైపు కొలిమిగుండ్లలో రామ్ కో, జిల్లా సరిహద్దున అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలు నెలకొన్న నేపథ్యంలో భారీ వాహనాల రాకపోకలు నిత్యం సాగుతుంటాయి. అవుకు బస్టాండ్ మలుపు కనిపించని తీరులో ఉండడంతో వేగంగా వెళ్లామంటూ ప్రమాదానికి గురికావాల్సిందే అన్నట్లుగా ఉంది రహదారి. కనీసం స్పీడ్ బ్రేకులు లేకపోడంతో మలుపు ఉన్నప్పటికీ వాహనాల వేగం ఏ మాత్రం తగ్గడం లేదు. ఈ మలుపు వద్ద ఫిబ్రవరిలో అవుకు పట్టణానికి చెందిన ఓ యువకుడు మోటార్ సైకిల్ మీద వెళ్తూ ప్రమాదం జరిగి మృతి చెందాడు. ఇక చిన్నచిన్న ప్రమాదాలు ప్రతిరోజూ జరుగుతూనే ఉంటాయి. ఆదర్శ పాఠశాల, కస్తూర్బా, మదర్ మోడల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కేజీబీఎస్ పాఠశాలతోపాటు తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఐటీఐ తదితర ప్రభుత్వ కార్యాలయాలు ఈ మలుపు సమీపానే ఉన్నాయి. విద్యార్థులు, ఉద్యోగులు ఈ మలుపు రోడ్డు దాటి వెళ్లాల్సి ఉంది. దీంతో ఈ రోడ్డు దాటాలంటే భయాందోళన తప్పని పరిస్థితి. అదేవిధంగా మార్కెట్ ఏరియాలోని మూడు రోడ్ల కూడలిలో, తేరువీధి, సెంటర్‌లోని నాలుగు రోడ్ల కూడళ్లలోనూ స్పీడు బ్రేకర్లు లేక నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి కనీసం స్పీడ్ బ్రేకులు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.